## నీళ్ల కోసం ఖాళీ బిందెలతో నిరసన



నీటి సమస్యను పరిష్కరించాలని సోమవారం వనపర్తి జిల్లా అమరచింత పట్టణం బీసీ కాలనీలోని 6, 7వ వార్డుల మహిళలు, యువకులు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. వీరికి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, ప్రజాపంథా నాయకులు మద్దతు తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని మున్సిపల్ మేనేజర్ హామీ ఇవ్వడంతో విరమించారు. **- అమరచింత**

## రోడ్డు కోసం బురదలో నాట్లు వేసి నిరసన



రోడ్డు కోసం బురదమయమైన రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలిపారు నిర్మల్ జిల్లా మామడ మండలం పరిమండల్ గ్రామస్థులు. కొత్తపల్లి ఒకటో వార్డులో శ్మశానానికి వెళ్లే దారి బురదమయంగా మారింది. కనీసం నడవలేని పరిస్థితి నెలకొనడంతో బురదమయమైన రోడ్డుపై నాట్లు వేసి గ్రామస్థులు ఇలా నిరసన తెలిపారు. **- నిర్మల్ అర్బన్**

## కలెక్టరేట్ ఎదుట దళితబంధు లబ్ధిదారుల ఆందోళన



దళితబంధు పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు రేవంత్ సర్కారు కుట్రలు చేస్తున్నదంటూ సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. గత సర్కారు చేయూతతో యూనిట్లు పెట్టుకున్న తాము ఇప్పుడు నడుపుకొనేందుకు అప్పులు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఖాతాలు ఫ్రీజ్ చేయడంతో 5వేల మందికిపైగా లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వాపోయారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని, లేదంటే ఆత్మహత్యలే శరణ్యమంటూ కన్నీటి పర్యంతమయ్యారు. **- కరీంనగర్ కలెక్టరేట్**

## ఉపాధి కల్పించాలని నేతకార్మికుల ధర్నా




కాంగ్రెస్ సర్కారు తప్పుడు విధానాల వల్లే మరమగ్గాల పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందంటూ సిరిసిల్లలోని చేనేత జౌళీశాఖ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు, ఆసాములు సోమవారం ధర్నా చేశారు. లాల్‌బావుటా చేనేత, వపర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం వల్ల కార్మికులు ఆకలి చావులు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. **- రాజన్న సిరిసిల్ల, నమస్తే తెలంగాణ**

## ఇన్నర్ రింగ్ రోడ్డు భూనిర్వాసితుల ధర్నా



ఖిలావరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులు వరంగల్ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఐదేండ్లుగా పరిహారం ఇవ్వకుండా 200 ఫీట్ల రోడ్డు పనులు చేపడుతున్నారని ఆరోపించారు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, రెవెన్యూ అధికారులు అవగాహన లేకుండా రేపు, మాపు అంటూ తిప్పుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే పదుల సంఖ్యలో నిర్వాసితులు మనోవేదనతో చనిపోయినట్టు తెలిపారు. హనుమకొండకు వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రం ఇచ్చేందుకు ర్యాలీగా వెళ్లారు. **- ఖిలావరంగల్**

## భూములు కాపాడాలని చెంచుల ఆందోళన




సీఎం రేవంత్‌రెడ్డి ఇలాకా, మంత్రి జూపల్లి నియోజకవర్గంలో చెంచుల భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్, తోడసం భీమ్‌రావు ఆరోపించారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట చెంచులు వర్షంలోనే ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మనాయక్, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కృష్ణారెడ్డితోపాటు రవి, భీమ్‌రావు వీరికి మద్దతు తెలిపారు. **- కొల్లాపూర్**

## 'సీతారామ' కెనాల్ పనులను అడ్డుకున్న అఖిలపక్షం




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వినోభానగర్ సమీపంలో సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ పనులను సోమవారం అఖిలపక్షం నాయకులు అడ్డుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన డిజైన్ ప్రకారం కెనాల్ నిర్మించి జూలూరుపాడు మండలం కాకర్ల, గుండెపుడి, పాపకొల్లుకు నీరందించాలని డిమాండ్ చేశారు. **- జూలూరుపాడు**

# ఎమ్మెల్యేల ఇండ్ల ముట్టడి.. ఆందోళన

### రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పింఛన్ ఐదు వేలు ఇవ్వాలి.. 19న 'చలో ప్రజాభవన్': అంగన్‌వాడీలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 15 : సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు, ఇండ్ల వద్ద ధర్నాలు చేపట్టారు. డిమాండ్ల సాధన కోసం 19న చలో ప్రజాభవన్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని, రూ.5వేల పింఛన్ ఇవ్వాలని, జీవో 10 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత కేసీఆర్ సర్కార్ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. డిమాం డ్లు నెరవేర్చకుంటే 19న శిశు సంక్షేమ శాఖ కా ర్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

#### ఎక్కడికక్కడ ముట్టడి

సీఐటీయూ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి ఇంటిని, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ క్యాంప్ కార్యాలయాలను ముట్టడించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు బొల్లం అశోక్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి




మహబూబాబాద్ తొర్రూరులో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ఇంటి ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు




సీఐటీయూ ఆధ్వర్యంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్‌వాడీలు, ఆయాలు

ఇంటిని ముట్టడించి, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకురాలు శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు గండి శైలజ, పసుల స్వరూప పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ యూనియన్ జిల్లా కార్యదర్శి స్నేహబిందు ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే మురళీనాయక్ క్యాంపు ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

#### అసెంబ్లీలో లేవనెత్తుతాం..

సీఐటీయూ నాయకులు నాగన్న, దుర్గారావు, తిరుపతమ్మ, మంగమ్మ, సలీమా, వీరలక్ష్మి పాల్గొన్నారు. నిజామాబాద్‌లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తాకు అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు వినతిపత్రం అందజేయగా, సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతానని ఆయన హామీ ఇచ్చారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. బాల్కొండ ఎమ్మె ల్యే ప్రశాంత్‌రెడ్డిని వేల్పూర్‌లో కలిసి వినతిప త్రం సమర్పించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాం పు కార్యాలయంలో వినతిపత్రం అందజేశా రు. 'భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల(ప్రజాభవన్) వద్ద అంగన్‌వాడీలు ధర్నాకు దిగారు. కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, భద్రాచ లం, అశ్వారావుపేట, ఖమ్మం, పాలేరు, మధి ర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజాభవన్లను ముట్టడించి వినతిపత్రాలు అందజేశారు. అంగన్‌వాడీ యూనియన్ (సీఐటీయూ) మంచిర్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భానుమతి, రాజమణి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ తీసి ముగ్గురు ఎమ్మెల్యేల ఇండ్ల ఎదుట ధర్నా చేశారు. కాగజ్‌నగర్ లో సర్‌సిల్క్ కాలనీలోని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఇంటి ఎదుట ధర్నా చేసి, మాజీ జడ్పీటీసీ పాల్వాయి సుధాకర్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నుమొల్ల కిరణ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఎదుట ధర్నా నిర్వహించారు.

## ఉపాధ్యాయురాలి కోసం ఆందోళన




బదిలీల్లో భాగంగా పాఠశాలకు కేటాయించిన ఉపాధ్యాయురాలు త్వరగా జాయిన్ అయ్యేలా చూడాలని జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం కిష్టాపురం ప్రాథమిక పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఇన్‌చార్జి డీఈవోను వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు. **- అయిజ రూరల్**

## డిగ్రీ కళాశాల కోసం పోస్టుకార్డు ఉద్యమం




జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో డిగ్రీ కాలేజీతోపాటు వసతి గృహాలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. అయిజ పట్టణంలోని ప్రభుత్వ, హరిహర జూనియర్ కళాశాలల విద్యార్థులతో కలిసి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి చేరేలా పోస్టుకార్డులను రాయించి పోస్ట్ చేయించారు. **- అయిజ**



## ఏజెన్సీ డీఎస్సీ కోసం ఐటీడీఏ ముట్టడి

ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం ములుగు జిల్లా ఏటూరునాగారంలోని ఐటీడీఏను ముట్టడించారు. తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో వంద శాతం రిజర్వేషన్ అమలుతో వెంటనే ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పీవో చిత్రమిశ్రాకు వినతిపత్రాన్ని అందజేశారు. **- ఏటూరునాగారం**



ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన వృద్ధ దంపతులు

## కొడుకు ఇంట్లోకి రానివ్వడం లేదు

- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వృద్ధ దంపతులు
- ఇంటికి చేరుకునే లోపే వృద్ధురాలి మృతి

ఎదులాపురం, జూలై 15 : కన్నకొడుకు ఇంట్లోకి రానివ్వడం లేదంటూ ఆదిలాబాద్ పట్టణానికి చెందిన 90 ఏండ్లకుపైబడిన వృద్ధ దంపతులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక క్రాంతినగర్‌కు చెందిన దేవ్‌రావు, విఠబాయి(90) దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. కొంతకాలం క్రితం పెద్ద కొడుకు మరణించాడు. చిన్న కుమారుడు గంగారాం ప్రైవేటు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వృద్ధ దంపతులు ప్రస్తుతం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అర్లీ(బీ)లో కూతురు విమల వద్ద ఉంటున్నారు. తన కుమారుడు తమను ఇంట్లోకి రానివ్వడం లేదని, ఆలనపాలన చూసుకోవడం లేదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆటోలో తిరిగి కూతురు విమల గ్రామం అర్లీ బీ వెళ్తుండగా తీవ్ర అనారోగ్యానికి గురైన విఠబాయి మార్గమధ్యంలో మరణించింది. కుమారుడు గంగారాం రాకపోవడంతో కూతురు విమల, అల్లుడు పాండురావు వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహించారు.

# వాటాల కోసం వాదులాట

- అమ్మ ఆదర్శ నిధుల కోసం టీచర్ల రగడ
- విద్యార్థుల ఎదుటే బూతు పురాణం
- పాఠశాలకు తాళం వేసిన గ్రామస్థులు
- నేడు గ్రామస్థుల సమక్షంలో విచారణ

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనుల కోసం మంజూరైన నిధుల విషయంలో ఇద్దరు ఉపాధ్యాయులు గొడవపడ్డారు. విద్యార్థుల ఎదుటే బూతులు తిట్టుకుంటూ చెప్పులతో కొట్టుకొట్టుకునే స్థాయికి వెళ్లారు. దీనికి సంబంధించి గ్రామస్థులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం సాలెగూడా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అమ్మ ఆదర్శ పథకం కింద ఎంపికైంది. ఇందుకోసం రూ.7.25 లక్షలు



ఇన్‌చార్జి హెచ్ఎం తిరుపతి నుంచి వివరాలు తెలుసుకుంటున్న గ్రామస్థులు

మంజూరయ్యాయి. హెచ్ఎం ఆనంద్‌రావు 20 రోజులుగా అనారోగ్య కారణాలతో సెలవులో ఉన్నాడు. మరో ఉపాధ్యాయుడు తిరుపతికి ఇన్‌చార్జి హెచ్ఎంగా బాధ్యతలు అప్పగించారు. సోమవారం హెచ్ఎం ఆనంద్‌రావు పాఠశాలకు వచ్చాడు. అమ్మ ఆదర్శ నిధుల విషయంలో హెచ్ఎం ఆనందరావు, ఇన్‌చార్జి హెచ్ఎం తిరుపతికి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. బూతులు తిడుతూ చెప్పులు చూపిస్తూ, రాళ్లతో దాడికి ఆనంద్‌రావు ప్రయత్నించాడు. విషయం తెలుసుకుని గ్రామస్థులు అక్కడికి వచ్చి గొడవను ఆపారు. పాఠశాలకు తాళం వేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. హెచ్ఎం ఆనందర్‌రావు ఇష్టానుసారంగా పనులు చేపట్టాడని, పాఠశాల మరమ్మతుల కోసం తెచ్చిన సామగ్రిని తమ ముందే ఆటోలో తరలించుకుపోయాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నిధుల వాటా అందకపోవడంతో హెచ్ఎం ఆనంద్‌రావు గొడవకు దిగాడని పేర్కొంటున్నారు. ఈ విషయమై ఎంఈవో మనుకుమార్‌ను వివరణ కోరగా.. మంగళవారం గ్రామస్థుల సమక్షంలో విచారణ చేపడుతామని తెలిపారు.